రాజమహేంద్రిలో ఉత్సాహంగా 5కె రన్



రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ రాజమహేంద్రవరంలో ఆదివారం 5కె రన్ ఉత్సాహంగా సాగింది. జీఎస్ఎల్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ 'పింక్ రన్' రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు.
–న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు (రాజమహేంద్రవరం)

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

రాజమహేంద్రవరం కలెక్టరేట్: జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, మున్సిపల్, మండలస్థాయిలోనూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం లేకుండా ప్రజలు తమ సమీపంలోని కార్యాలయాల్లోనూ అర్జీలు అందించవచ్చని ఆమె తెలిపారు.

● ఉద్యోగ మేళా రేపు

రాజానగరం: రాజానగరం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఈ నెల 22వ తేదీ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు తూర్పు గోదావరి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.సుధాకర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి హరిశ్చంద్రప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో మూడు కంపెనీలు పాల్గొంటాయని ఎస్ఎస్‌సీ/ఇంటర్/డిగ్రీ/డిప్లొమో/ఐటీఐ/బి-ఫార్మసీ, డి. ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఎంబీఏ విద్యార్హతలు కలిగి, 19 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు వారు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 83285 07473లో సంప్రదించాలన్నారు.

● ముగ్గురికి ఛార్జి మెమో

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో భక్తులకు గదులు కేటాయింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు ఉద్యోగులకు ఛార్జిమెమో ఇస్తూ ఈవో కె.రామచంద్రమోహన్ ఆదేశాలిచ్చారు. సీనియర్ అసిస్టెంట్లు పెన్నాడ వెంకటేశ్వరరావు, ఎం.ఎల్ గణపతిరావు, రికార్డు అసిస్టెంటు పి.తలుపులయ్యలు మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. ఇటీవల వివాహాల రద్దీ సమయంలో వసతి గదులకు డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారికి, భక్తులకు ఇబ్బందులు లేకుండా గదుల కేటాయింపులో జాబితా సిద్ధం చేస్తూ ఈవో ఆదేశాలిచ్చారు. అయితే గదులు కేటాయించకపోవడం, తీవ్ర జాప్యంతో భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీనిపై ఫిర్యాదు అందడంతో చర్యలు తీసుకున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీపై తెదేపా గురి

■ అభ్యర్థిగా రాజశేఖర్ పేరు ప్రకటన
■ మొదలైన ఎన్నికల సందడి

కాకినాడ కలెక్టరేట్, ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి అభ్యర్థిని ప్రకటించడంతో కూటమి శ్రేణుల్లో సందడి మొదలయ్యింది. 2025, మార్చిలో జరగనున్న ఈ ఎన్నికలకు కూటమి అభ్యర్థిగా బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం వేమవరానికి చెందిన పేరాబత్తుల రాజశేఖర్ పేరును తెదేపా అధినేత నారా చంద్రబాబు ఖరారు చేశారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలిపి, విజయం సాధించేందుకు కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో కొద్ది రోజులుగా సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఈసారి ప్రధాన రాజకీయ పార్టీలు బరిలో నిలిచే అవకాశం ఉండటంతో ఓటు నమోదు ఊపందుకుంది.

ఇదీ నేపథ్యం పేరాబత్తుల రాజశేఖర్ ఆది నుంచీ తెదేపాలో కొనసాగుతున్నారు. ఎంపీటీసీ సభ్యుడిగా, ఎంపీపీగా, జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేశారు. ఉమ్మడి జిల్లా జడ్పీ ఛైర్మన్ పదవి ఆయనకు త్రుటిలో తప్పింది. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ గ్రామీణ నియోజకవర్గం నుంచి తెదేపా టికెట్ ఆశించినా పొత్తుల్లో భాగంగా కుదర్లేదు.

నాడు 46 మంది బరిలో..

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ప్రస్తుతం ఇళ్ల వెంకటేశ్వరరావు(పీడీఎఫ్) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2019 నాటి ఎన్నికల్లో 46 మంది పోటీలో నిలిచారు. మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే ఇళ్ల విజయం సాధించారు. పీడీఎఫ్ నుంచి ఈసారి ఇంకా అభ్యర్థి పేరు ప్రకటించలేదు. మరికొందరు స్వతంత్రంగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

■ విధేయతకే పట్టం

- పేరు: పేరాబత్తుల రాజశేఖర్
- వయసు: 51
- తల్లిదండ్రులు: ఆది పటాభి రామయ్య, బాపిరత్నం
- విద్యార్హత: బీఏ
- కుటుంబం: భార్య సత్యవాణి, ఇద్దరు కుమారులు
- వృత్తి: ఆక్వా వ్యాపారం



తెదేపా అధినేత చంద్రబాబుతో రాజశేఖర్

పట్టభద్రుల సంఖ్య ఎక్కువే..

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. 2019లో జరిగిన ఎన్నికల్లో 2,93,794 మందికి ఓటు హక్కు ఉంది. ఉమ్మడి తూర్పు గోదావరిలో 1,72,415, ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 1,21,379 మంది ఓటర్లు అప్పట్లో ఉన్నారు.

● యువత అవకాశాల కల్పనకు కృషి

నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేసిన అధినేత చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆయనను అభ్యర్థిగా ఖరారు చేయడంతో కాకినాడలోని ఆయన నివాసంలో పలువురు కూటమి నాయకులు అభినందించారు. తునిలో తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, ఇతర నాయకులను కలిసిన రాజశేఖర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

■ పేరాబత్తుల పదవులు..

- 1996లో జి.వేమవరం ఎంపీటీసీ సభ్యుడిగా ఎన్నిక(కాంగ్రెస్)
- 2001-05 జిల్లా తెలుగు యువత కమిటీ సభ్యుడు
- 2006-11 ఐ.పోలవరం ఎంపీపీగా ఎన్నిక
- 2012-14 జిల్లా తెలుగు యువత కార్యదర్శి
- 2014-19 ఐ.పోలవరం జడ్పీటీసీగా ఎన్నిక.
- 2020-21 అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శి
- 2021-24 కాకినాడ గ్రామీణ నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి
- 2021-23 కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడి నియామకం
- 2023 నుంచి తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా, చంద్రబాబునాయుడి కార్యక్రమాల సమన్వయకర్తగా కొనసాగుతున్నారు.

2 విడతలుగా.. వరుసలు

■ గోపాలపురం పరిధిలో 365బీబీ కొత్త జాతీయ రహదారి



సాగిపాడు- దొండపూడి మధ్య పైవంతెన నిర్మించే ప్రాంతం

మొదటి విడత	జీలుగుమిల్లి–బుట్టాయగూడెం (26కి.మీ), ఎల్ఎన్డీపేట–పట్టిసీమ (14.4కి.మీ)
పనుల దూరం	40.4కిలోమీటర్లు
భూసేకరణకు కేటాయించిన నిధులు	25.6 కోట్లు
రెండో విడత	బుట్టాయగూడెం–ఎల్ఎన్డీపేట, పట్టిసీమ–కొవ్వూరు
పనుల దూరం	46.3 కిలోమీటర్లు
భూసేకరణకు కేటాయించిన నిధులు	రూ.50 కోట్లు

గోపాలపురం, న్యూస్‌టుడే: ఇప్పటికే మూడు జాతీయ రహదారుల ఉన్న గోపాలపురం నియోజకవర్గంలో మరొకటి మంజూరైంది. జీలుగుమిల్లి-కొవ్వూరు వరకు 365బీబీ పేరుతో నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ రోడ్డు పోలవరం, గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లో పలు గ్రామాల మీదుగా రెండు వరుసలలో నిర్మించనున్నారు. టెండర్లు ఖరారుకావడంతో మరో మూడు నెలలలో పనులు ప్రారంభం కానున్నాయి. జీలుగుమిల్లి-కొవ్వూరు మధ్య రెండు వరుసల రహదారి నిర్మాణంతో హైదరాబాద్-రాజమహేంద్రవరం మధ్య దూరం తగ్గుతుంది. అలాగే రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు సందర్శకులకు దగ్గర దారి సైతం ఏర్పడుతుంది. జీలుగుమిల్లి నుంచి పోలవరం మధ్యలో ప్రస్తుతం ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు చాలా చిన్నదిగా ఉండటంతో ప్రకృతి అందాలు కనిపించడం లేదు. రెండు వరుసల రోడ్డు నిర్మాణం పూర్తి అయితే పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. చాలా వరకు 365బీబీ రహదారి నిర్మాణం కోసం భూసేకరణ చేశామని, మొదటి విడత పనులు తొందరలో ప్రారంభిస్తామని డీఈ శ్రీనివాసరావు తెలిపారు.

చదువుల తల్లిని చిదిమేసింది..

బస్సు ఢీకొని పీజీ విద్యార్థిని మృత్యువాత



కె.పల్లవి (పాతచిత్రం)

హుకుంపేట, రాజమహేంద్రవరం నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్టీసీ డ్రైవరు నిర్లక్ష్యానికి ఓ పీజీ విద్యార్థిని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన రాజమహేంద్రవరం గ్రామీణం బొమ్మూరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాశీ విశ్వనాథం వివరాల మేరకు.. హుకుంపేట గ్రామంలోని వరలక్ష్మి కాలనీకి చెందిన కుంచె పల్లవి(22) నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ చదువుతోంది. నిత్యం హుకుంపేట నుంచి ఆటోలో బయలుదేరి లాలాచెరువు కూడలికి చేరుకుని.. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో కళాశాలకు వెళ్లేది. ఈ నెల 19న శనివారం ఉదయం తండ్రి యేసు రత్నం కుమార్తెను ద్విచక్ర వాహనంపై తీసుకువెళుతుండగా.. అదే దారిలో కళాశాలకు స్కూటీపై వెళ్తున్న స్నేహితురాలు కనిపించడంతో ఆమెతో కలిసి వెళతానని పల్లవి తండ్రిని కోరింది. స్నేహితురాలితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా.. అదే మార్గంలో కాకినాడ- రాజమహేంద్రవరం నాన్‌స్టాప్ ఆర్టీసీ బస్సు విద్యార్థినులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని తాకుతూ పోయింది. పల్లవి కుడి భుజాన ఉన్న పుస్తకాల బ్యాగు కాస్తా బస్సు కార్గో నిచ్చెనకు చిక్కుకుంది. బస్సు వేగానికి ఇద్దరినీ లాగడంతో స్నేహితురాలు ఓ వైపుగా పడి స్వల్ప గాయాలతో బయటపడగా పల్లవి బస్సు చక్రం కింద పడి తీవ్ర గాయాల పాలైంది. స్థానికులు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందింది. జరిగిన ఘటనకు ఆర్టీసీ డ్రైవరు నిర్లక్ష్యమే ప్రధాన కారణమని పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేశామని, డ్రైవరును అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నామని సీఐ తెలిపారు.

చదువుల తల్లి నా కూతురు

తన కుమార్తెకు చిన్ననాటి నుంచి చదువుపై ఎంతో ఆసక్తి అని.. ప్రతి తరగతిలోనూ ప్రథమస్థానంలో నిలిచిన చదువుల తల్లి అని పల్లవి తండ్రి రత్నం బోరున విలపించారు. కళాశాలకు వెళ్లి వస్తానని చెయ్యి ఊపుతూ వెళ్లిన క్షణాలే గుర్తుకు వస్తున్నాయంటూ కన్నీటి పర్యంతమయ్యారు. యేసు రత్నం, సిరోమణి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రత్నం ఓ ప్రైవేటు సంస్థలో చిరు ఉద్యోగి. పెద్ద బిడ్డ పల్లవి. అక్కున్లో పీజీ చేస్తూ వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటోంది. బ్యాంకు ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా నిలుస్తానని నిత్యం తల్లిదండ్రులతో చెప్పేది. 'ఆశయం నెరవేర్చుకుంటానని అన్నావు కదా అక్కా!.. వెళ్లి పోతున్నావా..!' అంటూ పల్లవి చెల్లి రోదించిన తీరుతో అంతా కంటతడి పెట్టారు. పల్లవి కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరి వల్ల కాకపోయింది.

నవ్వుల రేడుకు నివాళి



నివాళి అర్పించిన మిత్రబృందం


రాజమహేంద్రవరం సాంస్కృతికం: నవ్వుల రేడు రాజబాబు 88వ జయంతి వేడుక ఆదివారం గోదావరిగట్టున ఉన్న ఆయన విగ్రహం వద్ద జరిగింది. రాజబాబు మిత్రబృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మిత్రబృందం మాట్లాడుతూ.. రాజబాబు.. 1960లో చిత్రసీమలో ప్రవేశించి 590 చిత్రాల్లో విభిన్న పాత్రల్లో నటించి పేరు తెచ్చుకున్నారన్నారు. తాను సంపాదించిన దానిలో ఎక్కువ భాగం నిరుపేదలకు దానం చేశారన్నారు. రాజబాబు మేనల్లుడు బీఎస్ఎన్ఎల్ వాసు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవం



ఆత్రేయపురం: వాడపల్లి క్షేత్రం బ్రహ్మోత్సవ శోభతో అలరారుతోంది. ఉత్సవాలకు సోమవారం అంకురార్పణ ఘట్టాన్ని వైఖానస ఆగమశాస్త్ర బద్ధంగా నిర్వహించనున్నారు. మూడు రోజులు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులపాటు స్వామివారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమీయనున్నారు.

పుష్పయాగం.. నేత్రపర్వం



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శేషాచలంపై కొలువైన వేంకటేశ్వరుడి తిరుకల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు పుష్పయాగోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. క్షేత్ర వీధుల్లో రాజాధిరాజ వాహనంపై ఉభయ దేవేరులతో కలిసి స్వామివారు విహరించారు. శ్రీవారు శయన మహావిష్ణువు అలంకారంలో దర్శనమిచ్చారు.

■ వేద విద్యార్థుల నిరుద్యోగ భృతి గడువు పెంపు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వేదవిద్యార్థుల నిరుద్యోగ భృతి గడువు ఈనెల 23వరకు పెంచినట్లు జిల్లా దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. సెప్టెంబరు 26తో గడువు ముగియగా ప్రభుత్వం అక్టోబరు 23వరకు పెంచిందని, నిరుద్యోగ వేదపండితులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వేద విద్యలో క్రమాంతం ఆపై కోర్సులు అభ్యసించి ఉత్తీర్ణత పొందిన వారు.. దరఖాస్తుతో పాటు వేదవిద్య ధ్రువపత్రం, ఆధార్‌కార్డు నకళ్లతోపాటు.. ఎలాంటి ఉద్యోగం చేయడం లేదని ధ్రువపత్రం జత చేసి పంపాలన్నారు. 23న సాయంత్రం 5గంటల లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా దేవాదాయశాఖ అధికారి కె.నాగేశ్వరరావు సూచించారు. మరింత సమాచారం కోసం 0883 - 2478375 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని చెప్పారు.

■ ఆన్‌లైన్‌లో సీనియారిటీ జాబితా

మసీదు సెంటర్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల తాత్కాలిక సీనియారిటీ జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరిచామని జిల్లా డీఎంహెచ్‌వో డా.నరసింహానాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సోమవారం సాయంత్రం 4 గంటల్లోగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

◆ ముగిసిన రైఫిల్ షూటింగ్ పోటీలు

రాజానగరం: రాజానగరం మండలం సంపతనగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఓపెన్‌సైట్ క్యాటగిరీలు ఆదివారం ముగిశాయి. ఎస్‌జీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి విజేతల వివరాలను వెల్లడించారు. ఈ క్యాటగిరీలో ఓవరాల్ ఛాంపియన్స్‌గా అనంతరపురం, కర్నూలు, వైఎస్ఆర్ కడప జిల్లాలు నిలిచాయని ఆయన అన్నారు. ● బాలుర విభాగంలో.. ద్వితీయ స్థానంలో తూర్పుగోదావరి జిల్లా నిలిచింది. వీరికి డివైఈఓ నారాయణ బహుమతులు అందజేశారు.



జాతీయ స్థాయి పోటీలో పాల్గొనే జట్టు

◆ టెట్‌కు 420 మంది హాజరు

శ్యామలా సెంటర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. రాజమహేంద్రవరం లూథర్‌గిరి ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఉదయం జరిగిన పరీక్షకు 241 మందికి గాను 201 మంది హాజరు కాగా.. 40 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 241 మందికి గాను 219 మంది హాజరవ్వగా.. 22 మంది గైర్హాజరయ్యారని డీఎస్ఈఓ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈవీ.. ఛార్జింగ్ స్టేషన్లు ఏవీ?

పెరుగుతున్న వాహనాలు.. కనిపించని కేంద్రాలు

న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్(రాజమహేంద్రవరం)

ఈవీ(విద్యుత్తు వాహనాలు) కొనుగోలుపై జనం ఆసక్తి చూపుతున్నారు. పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వాలు సైతం విద్యుత్తు వాహనాలకు రాయితీలను కల్పించి ప్రోత్సహిస్తున్నాయి. మరోవైపు ప్రజా రవాణాలోనూ ఈ వాహనాలకు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో వాహనాల సంఖ్యకు అనుగుణంగా ఛార్జింగ్ స్టేషన్లనూ పెంచాలని వాహనదారుల నుంచి డిమాండ్ పెరుగుతోంది. వినియోగదారులు ఈవీలు, హైబ్రిడ్(పెట్రోలు, ఈవీ) వాహనాల కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. రెండేళ్ల కిందట జిల్లాలో విద్యుత్తు ద్విచక్ర వాహనాలు సుమారు 350 నుంచి 400 వరకు ఉంటే.. ఈ ఏడాది వీటి సంఖ్య 1,200 వరకు చేరినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కార్ల విషయానికొస్తే రెండేళ్ల కిందట 20 నుంచి 25 వరకు మాత్రమే ఉంటే ప్రస్తుతం 100కు పైనే ఈవీ కార్లు జిల్లాలో ఉన్నాయని ఓ కార్ల షోరూం మార్కెటింగ్ నిపుణుడు తెలిపారు. వచ్చే ఏడాదికి వీటి సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. హైబ్రిడ్ వాహనాలు 10 నుంచి 15 వరకు కనిపిస్తున్నాయి. హైబ్రిడ్ వాహనాలతో సమస్య పెద్దగా ఉండదు. ఎందుకంటే పెట్రోలు నిండుకున్నప్పుడు ఈవీలోకి, ఛార్జింగ్ అయినప్పుడు పెట్రోలుకు ఆటోమెటిక్‌గా మారిపోతుంది. ఈవీ వాహనాల విషయానికొచ్చేసరికి ఎక్కడైనా ఛార్జింగ్ అయిపోయిందా ఇక అంతే సంగతులు. ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు పెంచాలని వాహనదారులు కోరుతున్నారు.



రాజమహేంద్రవరం గోదావరి గట్టు సమీపంలో వాహనానికి ఛార్జింగ్

నగరంలో ఒకటి.. గ్రామీణంలో మరొకటి


✦ రాజమహేంద్రవరం గోదావరి గట్టు ప్రాంతంలో ఓ పెట్రోలు బంక్‌లో ఓలా ఛార్జింగ్ స్టేషన్ ఉంది. ఇది కేవలం ద్విచక్ర వాహనాలకు మాత్రమే పనిచేస్తుంది. ఇక్కడ రెండే పాయింట్లు ఉండగా వాటిలో ఒకటి పనిచేయటం లేదు. వేరే విద్యుత్తు వాహనాలకు ఇక్కడ ఛార్జింగ్ పెట్టేందుకు వీలు పడదు.

✦ రాజానగరంలో ఉన్నటువంటి ఈవీ స్టేషన్ వద్ద కార్లు, బస్సు, ఆటోలకు మాత్రమే పనిచేస్తుంది. ఉదాహరణకు హైదరాబాద్‌లో బయలు దేరిన ఈవీ బస్సు రాజమహేంద్రవరం వచ్చేప్పటికి సుమారు 60 శాతం ఛార్జింగ్ అవుతుంది. మిగిలిన ఛార్జింగ్‌తో విశాఖపట్నం వెళ్లాలంటే కష్టం. దీంతో ఇక్కడ 45 నిమిషాల నుంచి గంటపాటు ఛార్జింగ్ పెట్టుకుంటే మరలా 100 శాతం ఛార్జింగ్‌తో విశాఖపట్నం చేరుకోవచ్చని అందుకే ఇక్కడ ఛార్జింగ్‌కు ఆగుతామని ఓ ప్రైవేటు బస్ డ్రైవర్ ఆలీఖాన్ తెలిపారు. విజయవాడ నుంచి విశాఖకు వెళ్లే రహదారిలో కనీసం పది ఈవీ స్టేషన్‌లు ఉంటే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

దిల్లీ విధానం ఆదర్శం కావాలి

కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి దేశంలో సగానికి సగం విద్యుత్తు వాహనాలనే రహదారులపై తీసుకురావాలని భావిస్తోంది. దిల్లీ ప్రభుత్వం అక్కడి వాయు కాలుష్యం దృష్ట్యా ఈవీలను అధిక సంఖ్యలో ప్రోత్సహిస్తోంది. స్విచ్ దిల్లీ పేరుతో పాలసీ రూపొందించింది. 30 వేల ఛార్జింగ్ పాయింట్‌లను ఏర్పాటు చేస్తోంది. అక్కడ 1919 ఛార్జింగ్ స్టేషన్లు ఉండగా.. మరో 2,452 ఏర్పాటు చేయాలనుకుంటోంది.

ముంపు భూమి.. కలువ కొలను



పచ్చని పంటపొలాల మధ్య తెల్ల కలువలు కనువిందు చేస్తున్నాయి. ఓ వైపు కొండలు, మరో వైపు కలువలు చూపరులను ఆహ్లాద పరుస్తున్నాయి. ఈ అందమైన చిత్రం సీతానగరం మండలం రాపాక-నల్గొండ పంట పొలాలు మధ్యలో ఆదివారం దర్శనమిచ్చింది. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు కొండగోదావరి ముంపు నీరు పంట పొలాల్లోకి చేరింది. సుమారుగా 1500 ఎకరాల్లో ఈ పంటభూములు నేటికీ ముంపులోనే ఉన్నాయి. దీంతో చెరువులా మారిన ఈ భూముల్లో పూలు పుట్టుకొచ్చాయి. ముంపు లేకపోతే ఇక్కడ పొగాకు, మొక్కజొన్న సాగు చేసేవాళ్లమని స్థానిక రైతులు తెలిపారు.
- న్యూస్‌టుడే, సీతానగరం



చిగురించే టమాటా చుట్టూ.. చీరకట్టు

టమాటా ధర ఆకాశాన్ని అంటుతోంది. ఈ క్రమంలో ఆ సాగు ఎంతో అపురూపమైంది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రౌతుపాలెం గ్రామానికి చెందిన రైతు మేదుళ్ల రాంబాబు అరెకరంలో టమాటా పండిస్తున్నారు. ఈ పంటకు మంచి డిమాండ్ ఉండటంతో దిష్టి తగలకుండా చుట్టూ చీరలు కట్టారు. అటుగా వెళ్లే వాళ్లు ఆసక్తిగా చూస్తున్నారు.

- ఈనాడు, కాకినాడ

98 చక్రాల బాహుబలి

10.. 20.. 30.. కాదు ఏకంగా 98 చక్రాల హైడ్రాలిక్ యాక్సిల్ ట్రైలర్ ఇది. తమిళనాడు రాష్ట్రంలోని సేలం నుంచి ఒడిశాలోని తాల్చేరు విద్యుత్తు కర్మాగారానికి భారీ యంత్ర పరికరాలను అధికారులు ఇలా బాహుబలి వాహనంపై తరలిస్తున్నారు. మార్గంమధ్యలో జాతీయ రహదారి నంబరు 16పై ప్రత్తిపాడు వద్ద ఈ భారీ వాహనం కాసేపు ఆగింది. దీంతో అటుగా వెళ్తున్న వాహనదారులు, స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

- ఈనాడు, కాకినాడ





నీటి కుక్క.. కనిపించెను ఎంచక్కా..

సామర్లకోటలోని గోదావరి కాలువలో ఆదివారం నీటి కుక్కలు సందడి చేశాయి. వి.కె.రాయపురం-మాధవపట్నం మార్గంమధ్యలోని గోదావరిలో మూడు నీటికుక్కలు ముందుకూ.. వెనక్కి నీటిలో ఈదుతూ కనిపించాయి. గోదావరి పరివాహక ప్రాంతాలు, జల వనరులు అధికంగా ఉండే ప్రాంతాల్లో గుంపులుగా ఇవి సంచరిస్తుంటాయి. నీటిలో, నేలపై సంచరించగలిగే అరుదైన ఈ జీవులు చేపలను ఆహారంగా తీసుకుని జీవిస్తాయి.

- న్యూస్‌టుడే, సామర్లకోట గ్రామీణం

జలజల.. గలగల

ప్రత్తిపాడు మండలంలోని ఎరకంపాలెం ఉపప్రణాళిక మన్యం తూర్పు కనుమల్లోని జలపాతం చూపరులను ఆకట్టుకుంటోంది. కొండల నుంచి వచ్చే ఊటనీరు ఏడాది పొడవునా ప్రవహిస్తుంది. వర్షాకాలంలో మరింత రమణీయంగా కనువిందు చేస్తుంది. సముద్ర మట్టం నుంచి 1,700 మీటర్ల ఎత్తులో ఉండే ఈ జలపాతం కనువిందు చేస్తుంది. సెలవు రోజులు కావడంతో అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్దఎత్తున వస్తుంటారు.

- ఈనాడు, కాకినాడ



పిచ్చుకగూళ్లు.. చూస్తేనే తెరుచుకుంటాయి నోళ్లు..

న్యూస్‌టుడే, మామిడికుదురు

కోనసీమ అంటే ఆహ్లాదకరమైన పచ్చదనానికే కాదు.. అదరగొట్టే రుచులకూ చిరునామాయే.. ఇక్కడ పసందైన పిచ్చుకగూళ్లను కరకరలాడిస్తూ ఆరగించేస్తారు. ఇదేంటీ.. చిత్రంగా పిచ్చుక గూళ్లను తినడమేమిటని అనుకోకండి..! తీయగా ఉండే గర్రాజులనే వంటకాన్ని ఇక్కడి వాళ్లంతా దాని ఆకారాన్ని బట్టి పిచ్చుకగూళ్లు అని పిలుస్తుంటారు. విచిత్రం అనిపించే పేరునే కాదు.. దీని కథాకమామిషు తెలుసుకుందాం..!



నోరూరించే గర్రాజులు

216 జాతీయ రహదారి చెంత..

నగరం నుంచి మామిడికుదురు వరకు 216 జాతీయ రహదారికి ఇరువైపులా దాదాపు 70 వరకు గర్రాజులు తయారు చేసే దుకాణాలు విస్తరించాయి. రహదారి చెంతనే వీటిని వండుతూ విక్రయాలు చేస్తున్నారు. ప్రయాణికులు, వాహన చోదకులు వీటిని ఆసక్తిగా తిలకించడంతో పాటు ఆగి రుచి చూసి తీసుకువెళ్తున్నారు. ఆర్డర్లిచ్చి మరీ వీటిని చక్కగా కొనుగోళ్లు చేస్తున్నారు.

తయారు చేసేదిలా..

నానబెట్టిన బియ్యాన్ని యంత్రాలకు అమర్చిన రోకళ్లతో పిండిగా చేసి పాకం పట్టిన బెల్లం లేదా పంచదారను అందులో కలిపి ధారగా పడేలా పలచగా చేస్తారు. బాగా కాగిన నూనెలో రంధ్రాలున్న నిలువు చట్రం ద్వారా పిండిని తిప్పుతూ అందులో గుండ్రంగా పోస్తారు. కాసింత వేగిన తర్వాత దానిని అర్ధ చంద్రాకారంలో మడిచి దోరగా వేగే వరకు ఉంచుతారు. కొందరు నూనెకు బదులుగా నెయ్యి ఉపయోగిస్తారు. బెల్లం, పంచదారతో కాకుండా తేనెతో తయారు చేయించుకుంటారు. 30 నుంచి 40 గ్రాముల వరకు బరువుండే ఒక్కో గర్రాజీ రూ.10 నుంచి రూ.12కి విక్రయిస్తున్నారు. గాలి తగలని డబ్బాల్లో వీటిని జాగ్రత్త చేసుకుంటే దాదాపు మూడు వారాల వరకు నిల్వ ఉంటాయి.



తీపి గర్రాజుల తయారీలో మహిళ

ఇక్కడికిలా వచ్చి చేరింది..

దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం ఉపాధి రీత్యా బర్మా వెళ్లిన మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని కొందరు ముస్లింలు అక్కడి వంటకాన్ని ఇక్కడికి తీసుకువచ్చారు. అది క్రమేణా వారి శుభకార్యక్రమాల్లో ఓ సంప్రదాయ మిఠాయిగా నిలిచింది. అలా స్థానికంగా నగరం, మామిడికుదురులోనే దాదాపు 200 కుటుంబాల వారికి ఉపాధిగా మారింది. కోనసీమ మీదుగా ఉన్న 216 జాతీయ రహదారి వల్ల బాహ్య ప్రపంచంతో వీటికి బంధం మరింత ఏర్పడింది. దీంతో ఉభయ గోదావరి జిల్లాల్లో పలు చోట్ల వీటి విక్రయాలు పెరిగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో సహా యూఎస్ఏ, గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు వీటిని ప్రత్యేకంగా అట్ట పెట్టెల్లో భద్రపరచి తీసుకువెళ్తున్నారు.

దాత ఔదార్యం.. ఫలించిన ప్రయోగం

పెద్దమనసు చాటుకున్న ఆర్బీఐ పూర్వ సీజీఎం రామశాస్త్రి

న్యూస్‌టుడే, పెద్దాపురం

విద్యార్థి దశలో పాఠ్యాంశాలను చదివి మనసులో నిక్షిప్తం చేసుకోవడానికి ప్రయోగాలు ఎంతో దోహదం చేస్తాయి. ప్రయోగాత్మకంగా పాఠాలు విశదీకరిస్తే సత్వరమే విద్యార్థుల మెదడులోకి చొచ్చుకుపోయి వారు మరచిపోకుండా ఉండేలా సాయపడతాయి. సైన్స్ పాఠాలు చదవకూడదని, ప్రయోగాలు చేయడం ద్వారా చక్కగా అర్థమవుతాయని విశ్వసించి హైదరాబాద్‌కు చెందిన భారత రిజర్వు బ్యాంకు పూర్వ చీఫ్ జనరల్ మేనేజర్ అల్లంరాజు రామశాస్త్రి.. పెద్దాపురం పట్టణంలో అల్లంరాజు ఛారిటబుల్ ట్రస్టు (క్రియా, కాకినాడ సహకారంతో) పేరుతో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేశారు. రామారావుపేటలో 2023 సంవత్సరంలో రూ.15 లక్షల వ్యయంతో కేంద్రాన్ని ప్రారంభించారు. ఇందులో భౌతిక, రసాయన, జీవశాస్త్రాల విద్యార్థులకు ఉపయోగపడేలా ప్రయోగశాలలు ఏర్పాటుచేశారు. కిర్లంపూడి మండలంలోని గోనెడ ప్రభుత్వ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు బుద్దాల శ్రీనివాస్ పనితీరును తెలుసుకుని రామశాస్త్రి ఆయనకు కేంద్రం నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. పెద్దాపురం పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ కేంద్రంలోనే ప్రయోగ పాఠశాలు అభ్యసిస్తున్నారు. రోజూ జిల్లా నలుమూలల నుంచి 40 మంది వరకు విద్యార్థులు ప్రయోగాలు చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు ఆరు వేల మంది 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు ప్రయోగాల ద్వారా పాఠాలు నేర్చుకున్నారు.



కేంద్రంలో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు



జీవశాస్త్ర ప్రయోగాలకు నమూనాలు

బట్టీపడితే సైన్స్ రాదు..

సైన్స్ పాఠ్యాంశాలు బట్టీపడితే రావు. ప్రయోగాల ద్వారా పాఠం పూర్తిగా అర్థమవుతుంది. రోజూ జిల్లా నలుమూలల నుంచి వచ్చే విద్యార్థులకు వారి ఉపాధ్యాయుల సూచన మేరకు ప్రయోగ పాఠాలు బోధిస్తాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకంగా ప్రయోగాల ద్వారా సైన్స్ బోధించే కేంద్రం ఇదొక్కటే. - బుద్దాల శ్రీనివాసు, కేంద్రం నిర్వాహకుడు

ప్రజా చైతన్యంతో క్యాన్సర్ నివారణ

ఏవీఏ రోడ్డు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ప్రజల్లో చైతన్యం కలిగించడం ద్వారా క్యాన్సర్ నివారణకు కృషి చేసే క్రమంలో.. రాజమహేంద్రవరంలో చరిత్రాత్మకంగా 5కె రన్ నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రొమ్ము క్యాన్సర్ రోగ్ని అవగాహన కోసం పింక్ అక్టోబర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాజమహేంద్రవరంలోని పుష్కర ఘాట్ వద్ద జీఎస్ఎల్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో చేపట్టిన 5కె రన్‌ను మంత్రి ప్రారంభించారు. ఓఎన్జీసీ రాజమండ్రి ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంతనుదాస్ హాజరైన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. క్యాన్సర్ ముందుగా గుర్తిస్తే.. రోగి సంపూర్ణంగా కోలుకునే అవకాశాలు పెరుగుతాయని జీఎస్ఎల్ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. తెదేపా సీనియర్ నాయకులు గన్ని కృష్ణ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ తదితరులు మాట్లాడారు. ఈ రన్‌లో సుమారు 1,200 మంది జీఎస్ఎల్ విద్యాసంస్థలు, రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



5కె రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

5 గంటలు ఆలస్యంగా గౌతమి ఎక్స్‌ప్రెస్

సాంబమూర్తినగర్(కాకినాడ): లింగంపల్లి నుంచి కాకినాడ పోర్టుకు రావాల్సిన గౌతమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు 5 గంటలకు పైగా ఆలస్యంగా వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం 12.11 గంటలకు కాకినాడ చేరుకుంది. సాధారణంగా ఈ రైలు లింగంపల్లి నుంచి రాత్రి 8.30 బయల్దేరి సికింద్రాబాద్ స్టేషన్‌కు 9.10 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి 9.15కు బయల్దేరి మర్నాడు ఉదయం 6.58 గంటలకు కాకినాడకు చేరుకుంటుంది. 19వ తేదీ రాత్రి 9.15 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయల్దేరాల్సిన రైలు అర్ధరాత్రి దాటక 2.32 గంటలకు బయల్దేరింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడ్డారు. రైలు ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగా ఆలస్యమైనట్లు రైల్వే అధికారుల సమాచారం.

సాగునీటి విడుదల

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 6,800 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు 1300, 1500, 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాటన్ బ్యారేజీ వద్ద 10.90 అడుగుల నీటిమట్టం కొనసాగుతోందన్నారు. 27,154 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు

మసీదు సెంటర్ (కాకినాడ): జాతీయస్థాయి ఎంపికైన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కాకినాడ డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాకినాడలో జరుగుతున్న అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిసింది. అండర్-11, 14, 17, 19 విభాగాల్లో క్వాడ్, ఇన్‌లైన్ అంశాల్లో రోడ్డు, రింక్‌లో పోటీలు నిర్వహించామని ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. అండర్-11, 14, 17, 19 విభాగాల్లోని క్వాడ్ విభాగంలో 24 మంది, ఇన్‌లైన్ విభాగంలో 24 మంది కలిపి 48 మంది జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. నవంబర్ 2వ వారంలో దిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. డీఎస్‌డీవో, హరీష్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తలాటం హరీష్, టోర్నమెంట్ పరిశీలకులు ఎస్. దిలీప్‌కుమార్, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్, దొరస్వామిరాజు, కోశాధికారి సీహెచ్ రమేష్ విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వి.రవిరాజు, కె.సూరిబాబు, కోశాధికారి కోర్ల, ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా అసిస్టెంట్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయికి అర్హత సాధించిన క్రీడాకారులతో అతిథులు

కబడ్డీ ఛాంపియన్ కాకినాడ ఐడియల్ కళాశాల

క్రీడ

మండపేట, న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ యూనివర్శిటీ అంతర కళాశాలల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలతో పాటు, సౌత్ జోన్ కబడ్డీ జట్టు ఎంపిక ప్రక్రియ రెండు రోజుల పాటు మండపేట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. ఈ పోటీలకు ఉభయగోదావరి జిల్లాల నుంచి సుమారు 250 మంది పాల్గొన్నారు. ఛాంపియన్‌షిప్ పోటీలకు 16 జట్లు పోటీ పడగా అంతర కళాశాల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలో కాకినాడ ఐడియల్ కళాశాల ప్రథమ స్థానంలో నిలవగా కాకినాడ పీఆర్ కళాశాల ద్వితీయ స్థానం, మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. అదే విధంగా మొత్తం అన్ని టీముల నుంచి మెరుగైన క్రీడా నైపుణ్యం కనబరచిన 16 మంది క్రీడా కారులను నన్నయ యూనివర్శిటీ తరపున ఎంపిక చేశారు. వీరందరూ ఈనెల 30వ తేదీన చెన్నై ఎస్ఆర్ఎం కళాశాలలో నిర్వహించే సౌత్‌జోన్ అంతర కళాశాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎ.ఆనందరావు, వ్యాయామ అధ్యాపకుడు ఎన్.వీరాంజనేయులు, అధ్యాపకులు దిలీప్, రాజేష్ తదిరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.



సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన వివిధ కళాశాలల క్రీడాకారులు

వరిలో 45 బస్తాల దిగుబడి

సీతానగరం, న్యూస్‌టుడే: ఈ ఏడాది ఖరీఫ్‌లో వేసిన ఆర్బీ బయో వరి రకం కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి ఆశాజనకమైన అధిక దిగుబడులతో రైతులు ధాన్యం విక్రయాలు ప్రారంభించారని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు ఆదివారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1300 హెక్టార్లలో ఆర్బీ బయో రకం సాగు చేస్తే నల్లజర్ల, నిడదవోలు, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో ఇప్పటికే 500 హెక్టార్లలో కోతలు పూర్తిచేశారన్నారు. ఎకరాకు 42 నుంచి 45 బస్తాల ధాన్యం దిగుబడి సాధించారన్నారు. ఈ రకం ధాన్యం బయట మార్కెట్‌లో అధిక ధరలకే రైతులు విక్రయాలు చేసుకునే వీలుందన్నారు. క్వింటా ధాన్యం రూ.1750 నుంచి 1800 వరకు ధర ఉంటుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	11,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

ఆధార్ సరిచూశాకే వసతిగది కేటాయింపు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో భక్తులకు వసతి గదుల కేటాయింపులో అవకతవకలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టారు. గది పొందే భక్తుడి ఆధార్‌ను సరిపోల్చిన తర్వాతే కేటాయించాలని ఈవో కె.రామచంద్ర మోహన్ ఆదేశాలిచ్చారు. సీఆర్వో (సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం)లో గదిని కేటాయించే సమయంలో భక్తుల ఆధార్‌కార్డు, ఫోను నంబరు వివరాలను కంప్యూటర్ రసీదుపై నమోదు చేయాలని సూచించారు. రసీదు తీసుకుని వసతి సముదాయం వద్దకు వెళ్లినప్పుడు అక్కడ విధుల్లో ఉండే గుమస్తా రసీదులో వివరాల ప్రకారం ఆధార్ కార్డును పరిశీలించి వివరాలు నమోదు చేసి గది తాళాలు అందించాలని ఆదేశించారు. గదిని ఖాళీ చేసిన తర్వాత సామగ్రి అంతా సరిగ్గా ఉందని ధ్రువీకరించి రసీదుపై నమోదు చేసి ఇవ్వాలన్నారు. అడ్వాన్సు రుసుం భక్తుడికి తిరిగి ఇచ్చేందుకు సీఆర్వో వద్ద ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ కలెక్టరేట్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నవంబరు 11న మైనార్టీ సంక్షేమం, జాతీయ విద్యా దినోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుందని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఎం.సునీల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్యం, వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారం కింద రూ.1.25 లక్షలు, ధ్రువపత్రం, జ్ఞాపిక, డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారం కింద రూ.లక్ష ప్రోత్సాహకం, ధ్రువపత్రం, జ్ఞాపిక అందజేస్తారని తెలిపారు. ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అయిదేళ్ల బోధనా అనుభవం ఉండాలన్నారు. ఉర్దూ అకాడమీ జారీ చేసిన దరఖాస్తును పూరించి, ఆయా విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, రిజిస్ట్రార్ల ద్వారా ప్రమాణ ప్రతులను విజయవాడలోని ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీకి అందజేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

టి.నగర్: అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ (యూపీహెచ్‌సీ) ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా నాయకులు కేపీ నాయుడు, జేవీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉద్యోగుల సమస్యలపై వై-జంక్షన్ వద్ద సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పీహెచ్‌సీల నిర్వహణ ఏ విధంగా సదుస్తుందో.. అలాగే యూపీహెచ్‌సీలను కూడా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. తద్వారా మెరుగైన సేవలు అందించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకొన్నారు. గౌరవ అధ్యక్షుడిగా పవన్, జిల్లా అధ్యక్షుడిగా వెంకటలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా ఎం.అనిత, వెంకట్, కాశీ, నరేష్, జిల్లా సహాయ కార్యదర్శులుగా అనిల్ కుమార్, నూతన, బాలా, చంద్రశేఖర్, జిల్లా కోశాధికారిగా జీటీపే కుమార్, సభ్యులుగా కనక, సూర్య, రాణి, మంగాదేవి, సుజాత, శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ మూర్తి, రాజు, రెహమాన్ ఎన్నికయ్యారు.



నూతన కార్యవర్గం వీరే..

ఉసురుతీసిన విద్యుత్తు తీగ



మృతులు విశ్వేష్, పద్మ (పాత చిత్రం)

24 గంటల వ్యవధిలో తల్లి, కుమారుడు మృతి

సామర్లకోట: విద్యుత్తు తీగ యమపాశమైంది. రోజు వ్యవధిలో తల్లి, కుమారుడిని బలి తీసుకుంది. శనివారం తల్లి మృతిచెందగా.. ఆదివారం కుమారుడు ప్రాణాలు కోల్పోయిన హృదయ విదారక ఘటన సామర్లకోటలోని వీర రాఘవపురంలో చోటుచేసుకుంది. గ్రామంలోని నీలమ్మచెరువు వద్ద నివసించే చిట్టిమాని కామరాజు, పద్మ (43) దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కొడుకు విశ్వేష్(23) ఉన్నారు. పద్మ ఇళ్లలో పనులు చేస్తుండగా.. విశ్వేష్ పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. శనివారం ఇంటి వద్ద కొళాయి సమీపంలో దుస్తులు ఉతికి వాటిని ఆరేయడానికి వెళ్లిన పద్మ విద్యుదాఘాతంతో కాలువలో పడి మృతిచెందారు. ఆమె ప్రమాదవశాత్తు కాలువలో పడి ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు భావించారు. తల్లి మృతితో దుఃఖంతో ఉన్న విశ్వేష్‌కు ఆదివారం బంధువులు అల్పాహారం అందించారు. తిని చేయి కడగడానికి కొళాయి వద్దకు వెళ్లిన ఆయన వేలాడుతున్న విద్యుత్తు తీగ తగిలి షాక్‌తో కిందపడిపోయాడు. తల్లి మృతిచెందిన చోటే ఆయన కూడా పడిపోవడంతో కుటుంబ సభ్యులు పరిసరాలను గమనించగా విద్యుత్తు తీగ కనిపించింది. తక్షణం అధికారులకు సమాచారం ఇవ్వగా వారొచ్చి సరఫరా నిలిపివేశారు. విశ్వేష్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. 24 గంటల వ్యవధిలో తల్లీబిడ్డ మృతిచెందడంతో కుటుంబీకులు దుఃఖసంద్రంలో మునిగిపోయారు.

రాజమహేంద్రవరం

సినిమాలు దానవాయిపేట: శ్యామల: వేట్టయన్, ఊర్వశి: సత్యం సుందరం, సూర్యప్యాలస్: ఇద్దరు, రాజా: మార్టిన్, కుమారి, అప్సర: దేవర, అశోక: విశ్వం, స్వామి: స్వాగ్, అనుశ్రీ: జనక అయితే గనక, సూర్యమినీ: జిగ్రా, శివజ్యోతి: మార్టిన్, రంభ: రాధే కృష్ణ, మానాన్న సూపర్ హీరో (రెండేసి ఆటలు), మేనక: కల్లు కాంపౌండ్, మార్టిన్,(రెండేసి ఆటలు), వీఎస్ మహల్: వేట్టయన్, విశ్వం(రెండేసి ఆటలు).

మేమున్నాం.. మీకు తోడుగా



మురుగుతోయాతన..

సమస్య: నగరంలోని 17 డివిజన్ ఆల్కట్‌గార్డెన్స్ రైతుబజార్ ఎదురుగా ఉన్న ప్రధాన మురుగుకాలువ చెత్తతో నిండిపోయింది. చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్య తొలగించాలి.

చెత్తను తొలగించరూ..

సమస్య: నగరపాలక సంస్థ పరిధిలోని 17వ డివిజన్ స్వరాజ్‌నగర్ శివారు వీధిలో చెత్త పేరుకుపోయింది. శానిటేషన్ సిబ్బంది పది రోజులకోసారి మాత్రమే ఈ వీధులకు వచ్చి చెత్తను తరలిస్తున్నారు. చాలా ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**

పరిష్కారం: వెంటనే పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

ఏళ్లుగా ఇబ్బంది.. పరిష్కరించిన సిబ్బంది

నగరంలోని పలు సమస్యలపై ప్రజల నుంచి 'మేమున్నాం... మీకు తోడుగా'కు అందిన ఫిర్యాదులను నగరపాలక సంస్థ సంబంధిత విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు.

✦ తారకరామనగర్ శివారు వీధిలో వెలగని వీధి దీపాలకు సంబంధిత సిబ్బంది మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించినట్లు ఫిర్యాదుదారుడు వీర్రాజు తెలిపారు. ✦ వీరభద్రనగర్ రెండో వీధిలో వీధి దీపాలకు మరమ్మతులు చేయడంతో ప్రస్తుతం వెలుగుతున్నట్లు ఫిర్యాదుదారు వెంకటలక్ష్మి తెలిపారు.

✦ నగరంలోని నారాయణపురం ప్రధాన రోడ్డులోని మురుగు కాలువలో వేసిన పాత సిమెంట్ విద్యుత్తు స్తంభాన్ని విద్యుత్తు శాఖ సిబ్బంది తొలగించి తరలించారు. ఇక్కడ సమస్యపై 'ఇలా వదిలేస్తే మురుగు పారేదెలా' అనే శీర్షికన ఈ నెల 16వతేదీ 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపించి స్తంభాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం, దానవాయిపేట

83282 39927, 80089 02897

వనితల ఉపాధికి ఊతం

అభివృద్ధి దిశగా అడుగులేస్తున్న నగర మహిళలు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల స్వీయ ఉపాధికి ప్రభుత్వం ఊతమందిస్తోంది. వివిధ రుణాల మంజూరు ద్వారా తోడ్పాటునందిస్తూ అతివలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా కృషి చేస్తోంది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ప్రభుత్వం అందించే చేయూతను సద్వినియోగం చేసుకుంటూ పలువురు మహిళలు రాణిస్తున్నారు. కుటుంబానికి కొండంత అండగా నిలుస్తున్నారు.

ఇదీ లెక్క

రాజమహేంద్రవరం నగరంలో 9,128 వరకు స్వయం సహాయక మహిళా సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు) ఉన్నాయి. పలు సంఘాల్లోని మహిళలు బ్యాంకు లింకేజీ రుణాలు, వివిధ పథకాల ద్వారా అందే రాయితీ రుణాలతో వ్యాపారాలను చేపట్టి రాణిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 1,595 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు రూ.207.84 కోట్లు, పీఎం స్వానిధి ద్వారా రూ.37.08 కోట్లు అందించినట్లు మెప్మా అధికారులు చెబుతున్నారు. ఇవికాక ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకం కింద యూనిట్ల స్థాపనకు 47 మందికి సహకారం అందించగా, మరో 185 మందితో పట్టణ ప్రగతి యూనిట్లు (పీఎస్‌యూ) ఏర్పాటు చేయించినట్లు చెబుతున్నారు. అంతేకాక పీఎం విశ్వకర్మ యోజన పథకంలో నగరంలోని 3,214 మంది మహిళలకు చేతివృత్తి యూనిట్ల మంజూరుకు సిఫార్సు చేసినట్లు మెప్మా అధికారులు తెలిపారు.

పచ్చళ్లతో క్రమేణా వ్యాపారాభివృద్ధి



ఈ మహిళ పేరు పి.సంధ్య. నగరానికి చెందిన ఈమె తమ స్వయం సహాయక సంఘానికి మంజూరైన రుణంతో తొలుత చిన్నగా పచ్చళ్ల తయారీ ప్రారంభించి వ్యాపార కార్యకలాపాలను నిర్వహించడం మొదలుపెట్టారు. తర్వాత పీఎంఎఫ్ఎంఈ పథకంలో మంజూరైన రుణాన్ని సద్వినియోగం చేసుకుని వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకున్నారు. పెట్టుబడి, ఖర్చులు పోను నెలకు రూ.8 వేల వరకు చేతికి వస్తోందని చెబుతున్నారు. పచ్చళ్లను మెప్మాబజారు, కిరణా దుకాణాల ద్వారా విక్రయించడంతో పాటు.. ఆన్‌లైన్ వేదికగానూ అమ్మకాలు సాగిస్తున్నట్లు చెబుతున్నారామె.

జ్యూట్ బ్యాగ్‌ల తయారీతో ఆదాయం



నగరంలోని పదో డివిజన్‌కు చెందిన ఈమె పేరు సీహెచ్.లక్ష్మి. ఎస్‌హెచ్‌జీ రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధికి బాటలు వేసుకున్నారు. మెప్మా తరఫున ప్రభుత్వం అందించిన సహకారంతో జ్యూట్ బ్యాగ్‌ల తయారీ యూనిట్ నెలకొల్పారు. పీపీ యూనిట్ కింద రూ.1.50 లక్షల విలువైన మిషన్లు, మెటీరియల్ మంజూరు చేయడంతో పాటు జ్యూట్ బ్యాగ్‌ల తయారీలో శిక్షణ అందించడంతో తాను ఉపాధి పొందుతున్నారు. అలాగే, వస్తున్న ఆర్డర్ల మేరకు మరో నలుగురికి ఉపాధి కల్పించగలుగుతున్నారు. డీఎల్ఎస్ఏ నుంచి 25,200 జ్యూట్ బ్యాగ్‌లకు ఇటీవల ఆర్డర్లు రాగా.. ఇప్పుడు సీసీజీ బ్యాంకు నుంచి 60 వేల ఆర్డర్లు వచ్చినట్లు ఆమె చెబుతున్నారు. ప్రింటింగ్ ఉండే బ్యాగులు రూ.70, చిన్న బ్యాగులు రూ.50 చొప్పున మెప్మాబజార్లు, మహిళా మార్టుల ద్వారా కూడా విక్రయాలు జరుపుతూ నెలకు రూ.10 వేల వరకు చేతికి ఆదాయం వస్తున్నట్లు ఆమె చెబుతున్నారు.

ఈ కర్ర ప్రమాదాన్ని ఆపుతుందా?

ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: స్థానిక ఆల్కట్‌తోట ప్రాంతంలోని కన్నమ్మ గుడి వెనుక రోడ్డులో ఉన్న తూము వారి వీధిలో ఓ మ్యాన్‌హోల్ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. సుమారు ఇరవై రోజుల నుంచి రోడ్డు మలుపులో నడిమధ్యన ఉన్న ఇది ప్రమాదఘంటికలు మోగిస్తోంది. దీనిపై ఇనుప చక్రాలు దెబ్బతినడంతో, కర్ర అడ్డుగా పెట్టి ఉంచారు. నిత్యం వాహనదారులతో, పాదచారులతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో.. ఏ మాత్రం పట్టుతప్పినా ప్రమాదానికి గురి కావాల్సిన స్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



మ్యాన్‌హోల్ వద్ద కర్ర అడ్డుగా పెట్టారిలా..

దుర్గమ్మ ఆలయాల వద్ద అన్నదానం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా పేపరుమిల్లు రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నదానం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ అధ్యక్షుడు సీహెచ్.ప్రసాద్, ఉపాధ్యక్షులు ఐ.శ్రీనివాస్, కార్యదర్శి వింజమూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. దేవీచౌక్ వద్దా భారీ అన్నదానం జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బత్తుల రాజరాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఎద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

అలరించిన స్వర ప్రభంజనం



విభావరిలో గీతాలు ఆలపిస్తున్న కోరుకొండ ప్రభ, హాజరైన గాయనీ గాయకులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శోభన్‌బాబు కల్చరల్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వర్ధమాన గాయని కోరుకొండ ప్రభ 116 పాటలతో నిర్వహించిన స్వర ప్రభంజనం అలరించింది. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఆనం కళాకేంద్రంలో మొదలైన కార్యక్రమంలో పాత, కొత్త చిత్రాల్లోని మధుర గీతాలను ఆలపించిన ప్రభకు నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు సహకరించారు. డాక్టర్ కంటే వీరన్న చౌదరి, మల్లాది రాజేశ్వరరావు, బోడపాటి శ్రీనివాస్, కృష్ణవేణి, భారతి, సూర్యకుమారి, లక్ష్మీదేవి తదితరులు సహకార గానం చేశారు. గతంలో 50 పాటలు పాడి అర్ధశత గానప్రభ, 75 సినీగీతాలు పాడి వజ్రామృత గానప్రభ బిరుదు పొందిన కోరుకొండ ప్రభ తాజాగా 116 గీతాలు ఆలపించడం గర్వకారణమని సంస్థ నిర్వాహకుడు దొండపాటి సుబ్రహ్మణ్యం తెలిపారు. పి.వి.ఎస్.కృష్ణారావు, అల్లు బాబీ, గుబ్బల రాంబాబు, బళ్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంలో బీసీలకు మేలు'



మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావు, చిత్రంలో నాయకులు

వి.ఎల్.పురం, ఏ.వి.ఏ.రోడ్డు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో బీసీలకు మేలు జరుగుతుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేయడం శుభపరిణామమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌ఛార్జి వైనూకాలమ్మ, సంఘ జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు అన్నారు. మాతృ వియోగంతో బాధపడుతున్న బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లద్దిక మల్లేష్‌ను పరామర్శించేందుకు వారు ఆదివారం రాజమహేంద్రవరం వచ్చారు. తొలుత స్థానిక గంటాలమ్మగుడి వీధిలోని లద్దిక మల్లేష్ నివాసానికి వెళ్లి.. ఇటీవల మృతి చెందిన ఆయన తల్లి కనకదుర్గమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం మీడియాతో నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు రక్షణ చట్టం తీసుకురావడానికి ఇప్పటికే సమావేశం ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్, కులగణన కూడా జరిగేలా చూడాలన్నారు. బీసీ జనాభాకనుగుణంగా బడ్జెట్‌లో 50 శాతం నిధులు కేటాయించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలోని 140 బీసీ కులాల అభ్యున్నతికి పనిచేస్తుందని, గ్రామస్థాయి నుంచి ఉద్యమ నిర్మాణం చేపడుతుందని అన్నారు. నూకాలమ్మ మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేశామన్నారు. బీసీల అభ్యున్నతికి సీఎం కృషి చేస్తున్నారన్నారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సమాన భాగం ఇవ్వాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రచార కమిటీ కన్వీనర్ లక్ష్మణరావు, బీసీ నాయకులు బెజవాడ రంగారావు, సంజీవరావు, పలువురు మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సృజన లేఖ రాద్దామా..

■ తపాల శాఖ పోటీ

■ విజేతలకు నగదు బహుమతులు



రాజమహేంద్రవరం ప్రధాన తపాలా కార్యాలయం

న్యూస్‌టుడే, దేవీచౌక్

ప్రజల్లో స్టాంపుల సేకరణ(ఫిలాటలీ) అభిరుచిని పెంపొందించేందుకు భారతీయ తపాలా శాఖ 2024-25 ఆర్థిక సంవత్సరంలో దాయి అఖర్ ఉత్తరాల పోటీని జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసింది. ఈ పోటీలో పాల్గొనేవారు 'ది జాయ్ ఆఫ్ రైటింగ్ ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఎ డిజిటల్ ఏజ్' శీర్షికను ఉద్దేశించి ఆంగ్లం, హిందీ, అన్ని ప్రాంతీయ భాషల్లో ఉత్తరాలు రాయవచ్చు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు అన్ని వయసుల వారూ అర్హులే. పోటీలను రెండు విభాగాలు(18 సంవత్సరాల లోపు, ఆపై)గా విభజించి నిర్వహిస్తున్నారు.

పోటీలకు చివరి తేదీ: 14-12-24

ఇప్పటి వరకు వచ్చిన ఉత్తరాలు: 120

పోటీల్లో పాల్గొనేవారు ఇన్‌ల్యాండ్ లెటర్‌పై రాస్తే 500 మాటలు మించకుండా, ఎ4 సైజ్ పేపరుపై రాసి ఎన్వలప్ ద్వారా పంపేవారైతే వెయ్యి మాటలకు మించకుండా తమ సొంత దస్తూరీతో రాయాలి. అలా రాసిన ఉత్తరాలను సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, రాజమండ్రి పోస్టల్ డివిజన్, రాజమండ్రి-533101 అనే చిరునామాకు పంపాలి. చిరునామా పైన ఎంట్రీ ఫర్ దాయి అఖర్ 2024-25 అని రాసి పోస్ట్ చేయాలి. రిజిస్టర్, స్పీడ్ పోస్ట్ ద్వారా పంపేవాటిపై సంబంధిత తపాలా కార్యాలయంలో ఫిలాటలీ స్టాంపులు అందుబాటులో ఉంటే అతికించాలి. రాసే ఉత్తరాల్లో తమ సంతకంతో వయసు ధ్రువీకరించాల్సి ఉంటుంది.

జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రోత్సాహం

జాతీయ స్థాయిలో రాసిన అత్యుత్తమ ఉత్తరాల్లో ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో రాసిన అత్యుత్తమ ఉత్తరాల్లో ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు నగదు పురస్కారం బహూకరిస్తారు. ఇతర వివరాలకు సమీపంలోని తపాలా కార్యాలయంలో సంప్రదించాలని రాజమహేంద్రవరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు తెలిపారు.

ప్రజారోగ్యాన్ని కాపాడే సైనికులు: దుర్గేష్

ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: ప్రజల ఆరోగ్యాన్ని వైద్యులు ఏ స్థాయిలో కాపాడుతారో.. అదే స్థాయిలో ల్యాబ్ టెక్నీషియన్లు కూడా పరిరక్షిస్తారని మంత్రి దుర్గేష్ కొనియాడారు. ఆదివారం నగరంలోని షెల్టాన్ హోటల్‌లో రాజమండ్రి ల్యాబ్స్ అండ్ ల్యాబ్ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన తూర్పుగోదావరి జిల్లా స్థాయి సమావేశానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డయాగ్నోకాన్-2024 పేరుతో జరిగిన ఈ సమావేశంలో ల్యాబ్ టెక్నీషియన్లు తమ సమస్యలను మంత్రికి వివరించి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ల్యాబ్ టెక్నీషియన్ల సంక్షేమ బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆధునిక వైద్యం వచ్చిన తరువాత రోగ నిర్ధారణకు వైద్యులు వీరిపైనే ఆధారపడే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కడికక్కడ ల్యాబ్ టెక్నీషియన్ల ఖాళీ పోస్టులు గుర్తించి వాటిని భర్తీ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. సామాజిక బీమాలో భాగస్వాములను చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.



దుర్గేష్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

జాతీయస్థాయి పోటీలకు అనన్య

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: విజయనగరంలో ఈనెల 18నుంచి 20వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్-9 ఓపెన్ బాల, బాలికల చెస్ పోటీల్లో రాజమహేంద్రవరం విద్యార్థి చింతా అనన్య ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని జిల్లా చదరంగం సంఘ కార్యదర్శి జీవీకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7రౌండ్లకు గాను 6పాయింట్లు సాధించి ద్వితీయస్థానంలో నిలిచి డిసెంబరులో పూణెలో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా అన్యను చదరంగం సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.



బహుమతి అందుకుంటున్న అనన్య

రన్ విజేతలు వీరే

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: నగరంలోని ఆదివారం జరిగిన పింక్ రన్‌లో విజేతలకు బహుమతులు అందించారు. 5కె రన్‌లో మొదటిస్థానంలో నిలిచిన చెల్లుబోయిన వెంకట ప్రదీప్‌కు రూ.15 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన కిలపర్తి భాస్కర్‌కు రూ.10వేలు, తృతీయస్థానంలో నిలిచిన శరత్‌కు రూ.5 వేలు చెక్కును నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అందజేశారు. విజేతలు ముగ్గురూ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు కావడం విశేషం.



బహుమతి చెక్ రూపంలో అందిస్తున్న ఎమ్మెల్యేలు

ప్రతి ఆదివారం 'హ్యాపీసండే'

పుష్కర ఘాట్ వద్ద ఇక ప్రతీ ఆదివారం 'హ్యాపీ సండే' కార్యక్రమం నిర్వహిస్తామని ప్రజాప్రతినిధులు తెలిపారు. 5కె రన్‌తో హ్యాపీ సండే మొదలైనట్టు భావించాలన్నారు.

ఇద్దరి అదృశ్యం

రాజమహేంద్రవరం నేరవార్తలు: జాంపేట ప్రాంతానికి చెందిన తన భర్త బి.బలరామ్ సెప్టెంబరు 22వ తేదీ నుంచి కనిపించడం లేదని.. ఆయన భార్య లక్ష్మి ఆదివారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

✦ సీతంపేటకు చెందిన ఓ బాలిక (15) ఆదివారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో బాలిక తల్లి మూడో పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాలీ ఆటో ఢీకొని..

ఆవరోడ్డులోని గారపాటినగర్‌కు చెందిన సీహెచ్.చంద్రం తన ద్విచక్ర వాహనంపై ఆదివారం ఉదయం తాడితోట బైపాస్ రోడ్డులో వెళుతుండగా ఓ ట్రాలీ ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి గాయాలు కావడంతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రి వర్గాలు ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మద్యం విక్రేత అరెస్టు

ఆల్కాట్‌తోటకు చెందిన ఎం.రాము తన ఇంటి వద్ద మద్యం విక్రయిస్తుండగా రెండో పట్టణ పోలీసులు ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు. అతడి వద్ద ఉన్న 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బొమ్మూరు వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో వృద్ధులకు పండ్లు అందజేస్తున్న సుబ్బరాజు

పేదలకు అన్నదానం

ధవళేశ్వరం: ఆర్ఎస్ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ రంకిరెడ్డి సుబ్బరాజు జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం తిలక్‌రోడ్ సాయిబాబా గుడి, బొమ్మూరు వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రం, ధవళేశ్వరం స్ఫూర్తి ఛారిటబుల్ ట్రస్ట్ వద్ద అన్నదానం చేశారు. వృద్ధులకు పండ్లు అందజేశారు.

బొమ్మూరు ఎస్సైగా రమేష్

రాజమహేంద్రవరం నేరవార్తలు: బొమ్మూరు స్టేషన్ ఎస్సైగా సీహెచ్.వి.రమేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం రెండో పట్టణ స్టేషన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తూ ఆయన బదిలీపై బొమ్మూరుకు వచ్చారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

నేడు ప్రజా వేదిక

టి.నగర్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా వేదిక జరుగుతుంది. మున్సిపల్ కమిషనర్ కేతన్ గర్గ్ ముఖ్య అతిథిగా పాల్గొని సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారని అధికారులు తెలిపారు.

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

డిటీగా రాజాబాబు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం గ్రామీణ తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా రాజాబాబు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్టు కొవ్వూరు ఆర్‌అండ్‌ఆర్ యూనిట్ 1 లో స్పెషల్ డిప్యూటీ తహసీల్దారుగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయంతో ఇక్కట్లు

ధవళేశ్వరం: రాజమహేంద్రవరం గ్రామీణం పరిధిలో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులు, వర్షానికి విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో జనం అవస్థలు పడ్డారు. నిద్ర లేకపోవడంతోపాటు దోమలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి సుమారు 10.30 గంటలకు సరఫరా నిలిచిపోగా 1.30 గంటలకు కూడా పునరుద్ధరణ కాలేదు. ధవళేశ్వరం విద్యుత్తు శాఖ ఏఈ శ్రీనుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పటికీ లోపం ఎక్కడ ఉన్నదీ తెలియలేదు. విద్యుత్తు సరఫరా ఇస్తుండగా వెంటనే ట్రిప్ అయిపోతుండటంతో సాంకేతిక లోపం ఉందని గుర్తించారు. లైన్ లోపం కాదని, 11 కేవీ ఫీడర్లలోనూ తనిఖీ చేస్తున్నామని ఏఈ శ్రీనుబాబు తెలిపారు. ఎక్కడ లోపం ఉన్నదీ గుర్తించిన తరువాత సరిచేసి పునరుద్ధరిస్తామన్నారు.

ప్రాథమిక పాఠశాలలకు పూర్వవైభవం

కూటమి ప్రభుత్వం చర్యలు

– న్యూస్‌టుడే, బిక్కవోలు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చొరవతో ప్రాథమిక పాఠశాలలకు పూర్వవైభవం రానుంది. వైకాపా ప్రభుత్వం జీవో 117 తీసుకువచ్చి ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసింది. మూడు, నాలుగు, ఐదు తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయాలన్న అప్పటి ప్రభుత్వ నిర్ణయంతో ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమయ్యాయి. దూరంగా ఉన్న ఉన్నత పాఠశాలలకు పంపలేక అప్పులు చేసైనా చాలామంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపారు. చాలాచోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్య అభ్యసించే వారి సంఖ్య పది లోపే ఉంది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.



ప్రాథమిక పాఠశాల

జిల్లాలో పరిస్థితి ఇదీ..

తూర్పు గోదావరి జిల్లాలో 711 ప్రాథమిక, 72 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థుల్ని మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో చేర్చారు. ఇలా జిల్లాలో దాదాపు 502 ప్రాథమిక పాఠశాలలు ఉన్నత పాఠశాలల్లో విలీనమయ్యాయి. చాలాచోట్ల ప్రాథమిక పాఠశాలల్లో కొత్తగా నిర్మించిన భవనాలు కూడా ఖాళీగా ఉండగా.. ఉన్నత పాఠశాలల్లో తరగతి గదుల్లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న దుస్థితి ఉంది.

హర్షణీయం..



జీవో 117ను ప్రభుత్వం రద్దు చేయడం హర్షణీయం. దీని వల్ల ప్రాథమిక పాఠశాలలు పునరుజ్జీవం పొందుతాయి. విద్యార్థులు ప్రాథమిక విద్యకోసం సుదూరం వెళ్లాల్సిన కష్టం తప్పుతుంది. డీఎస్సీ నియామకాలకు మార్గం సుగమం అవుతుంది. జీవో రద్దు వల్ల ఉన్నత పాఠశాలల్లో సమస్యలు ఉత్పన్నమైతే ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలి.
- వెంకటేశ్, ఉపాధ్యాయుడు, రంగాపురం, బిక్కవోలు మండలం

విద్యావ్యవస్థ బాగుపడుతుంది



జీవో రద్దు వల్ల ప్రాథమిక విద్యావ్యవస్థ బాగుపడుతుంది. చాలాచోట్ల 3, 4, 5 తరగతుల గదులు ఖాళీగా ఉండి దుస్థితికి చేరుతున్నాయి. విద్యార్థులు వెనక్కి రావడం వల్ల ఇవి వినియోగంలోకి రానున్నాయి. ఉన్నత పాఠశాలల్లో వసతి సమస్య పరిష్కారమవుతుంది. ప్రైవేటు పాఠశాలల్లో చేరిన చిన్నారులు తిరిగి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే అవకాశం ఉంది.
- కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు, నల్లమిల్లి, రంగంపేట మండలం

మోడల్ పాఠశాలల వల్ల ప్రయోజనం



ప్రతి మేజర్ పంచాయతీలో మోడల్ ప్రాథమిక పాఠశాల నెలకొల్పడం వల్ల విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తారు. ఇప్పుడు ప్రాథమిక స్థాయిలో ఏకోపాధ్యాయ పాఠశాలలే ఎక్కువగా ఉన్నాయి. ఉపాధ్యాయులు రెండు తరగతులకు బోధించాల్సి వస్తోంది.
- సూరిబాబు, హెచ్‌ఎం, పులుగుర్త, అనపర్తి మండలం

మౌలిక వసతులు కల్పించాలని ఆందోళన



నినాదాలు చేస్తున్న రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు

సింగంపల్లి (రంగంపేట), న్యూస్‌టుడే: రంగంపేట మండలం సింగంపల్లిలోని సి.పి.రెడ్డి నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలంటూ రైతు కూలీ సంఘం ఆదివారం ఆందోళన చేపట్టింది. కాలనీవాసులు రహదారులు, మురుగు కాలువలు, వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం ముప్పై ఏళ్లుగా పోరాడుతున్నా ఎటువంటి సౌకర్యాలూ కల్పించలేదని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీవాసులకు పట్టాలు అందించి పక్కా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా సహకరించాలని కోరారు. సింగంపల్లిలో చేపట్టిన కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, నాయకులు వల్లూరి రాజబాబు, కుంచే అంజిబాబు, మడికి సత్యం, ఎల్లే సత్తిబాబు పాల్గొన్నారు.

సుపరిపాలనే కూటమి ధ్యేయం



కుతుకులూరులో బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజలకు సుపరిపాలన అందించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా అనపర్తి మండలం పులగుర్త, కుతుకులూరు, పొలమూరు గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో చేపట్టిన పనులను వివరిస్తూ ఏర్పాటు చేసిన బోర్డులను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అయిదేళ్ల వైకాపా పాలనలో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. నరేగా నిధులను సైతం దారి మళ్లించారని తెలిపారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

బిక్కవోలు: గ్రామాల సర్వతోముఖాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం బిక్కవోలు, బలభద్రపురం, ఊలపల్లి, కాపవరం, తొస్సిపూడి, కొమరిపాలెం, పందలపాక గ్రామాల్లో పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా రూ.3.49 కోట్ల పనులు చేపట్టేందుకు భూమి పూజ చేశారు. కూటమి నేతలు పి.వి.రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి పల్లె పండగలో ఎమ్మెల్యే

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం జరిగే పల్లె పండగ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొననున్నారు. దోసకాయలపల్లి, బుచ్చెంపేట, గుమ్ములూరు, మధురపూడి, గాడాల గ్రామాల్లో ఆయన పాల్గొంటారు.

ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం



ఆలయానికి దూరంగా తీగలు అమర్చుతున్న సిబ్బంది

బొమ్మూరు, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చొరవతో సమస్య పరిష్కారమైంది. బొమ్మూరు నేతాజీనగర్‌లో కనకదుర్గ ఆలయానికి చేర్చి ఉన్న 11 కేవీ విద్యుత్తు తీగలను సిబ్బంది శనివారం తొలగించి దూరంగా అమర్చారు. దసరా ఉత్సవాల్లో ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యేకు నిర్వాహకులు, తెదెపా నాయకులు ఈ సమస్యను తెలియజేయగా ఆయన స్పందించి సంబంధిత అధికారితో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. ఏఈ శ్రీనుబాబు స్పందించి సిబ్బందితో తీగలను దూరంగా వేయించారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారం కావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

పేదలకు అన్నదానం



బొమ్మూరులో వృద్ధులకు పండ్లు అందజేస్తున్న సుబ్బరాజు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ఆర్‌ఎస్‌ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ రంకిరెడ్డి సుబ్బరాజు జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం తిలక్‌రోడ్ సాయిబాబా గుడి, బొమ్మూరు వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రం, ధవళేశ్వరం స్ఫూర్తి ఛారిటబుల్ ట్రస్ట్ వద్ద అన్నదానం చేశారు. వృద్ధులకు పండ్లు అందజేశారు.

బొమ్మూరు ఎస్సైగా రమేష్

రాజమహేంద్రవరం నేరవార్తలు: బొమ్మూరు స్టేషన్ ఎస్సైగా సీహెచ్.వి.రమేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం రెండో పట్టణ స్టేషన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తూ ఆయన బదిలీపై బొమ్మూరుకు వచ్చారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా



పైపులైను లీకేజీతో తాగునీటి వృథా

ప్రశ్న: జి.దొంతమూరులో నీటిశుద్ధి ప్రాజెక్టు నుంచి చంద్రేడు, పెదరాయవరం గ్రామాలకు వెళ్లే పైపులైను దెబ్బతినడంతో వారం రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది.
- శ్రీను, చంద్రేడు

సమాధానం : ఇటీవల ప్రధాన పైపులైనుకు మరమ్మతు చేశాం. లీకేజీని పరిశీలించి మళ్లీ మరమ్మతులు చేపట్టి చంద్రేడు, పెదరాయవరానికి నీటి ఇబ్బంది లేకుండా చేస్తాం.
- కిషోర్, ఆర్.డబ్ల్యు.ఎస్, జేఈ, రంగంపేట

– న్యూస్‌టుడే, రంగంపేట

వీధి దీపాలు వెలగక అవస్థలు

సమస్య: హుకుంపేట నుంచి తూర్పు రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డులో రాత్రి సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
- జి.శ్రీనివాస్, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించి వీధి దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటాం.
- రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి,

మురుగుతో ఇబ్బందులు

సమస్య: హుకుంపేట పంచాయతీ పరిధి గణేష్‌నగర్ కాలనీలో తాగు నీటి ట్యాంకు వద్ద డ్రెయినేజీ నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో మురుగు ఎటూ వెళ్లక దుర్వాసన వ్యాపిస్తోంది. దోమల బెడద వేధిస్తోంది.
- సిద్ధార్థ్, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి కాలువను శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకుంటాం. **– రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి, హుకుంపేట**

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

గ్రామీణ అంతర్గత రోడ్లకు మహర్దశ



పొలమూరులో అధ్వానంగా రహదారి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చించి గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులను సిమెంటు కాంక్రీటుతో నిర్మాణానికి చర్యలు చేపట్టింది. గత వైకాపా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై పూర్తి నిర్లక్ష్యం వహించింది. కేంద్ర, ఆర్థిక సంఘ నిధులను సైతం పక్కదారి పట్టించింది. కనీస వసతులు సమకూరక పల్లెల్లో ప్రగతి పడకేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లె పాలనపై దృష్టి సారించింది. ప్రస్తుతం పల్లె పండగ పేరిట అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అనపర్తి నియోజకవర్గంలో రామవరం, మహేంద్రవాడ గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భూమి పూజ చేశారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నారు. అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో 70 రహదారుల నిర్మాణానికి రూ.10.56 కోట్లు, పెదపూడి మండలంలో 35 రహదారులకు రూ.3.49 కోట్లు మొత్తం రూ.14.05 కోట్లు మంజూరు చేశారు. ప్రాధాన్య క్రమంలో సీసీ రహదారుల నిర్మాణం చేపట్టి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అనపర్తి ఎంపీడీవో రామకృష్ణారెడ్డి తెలిపారు.

పాఠశాలలో ఎల్‌ఈడీ తెర అపహరణ

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని నరసాపురం గ్రామంలో టీవీ స్క్రీన్ చోరీకి గురైంది. పదో తరగతి గదిలోని రూ.1.21 లక్షల విలువైన 165 సెంటీ మీటర్ల పొడవైన ఎల్‌ఈడీ స్క్రీన్‌ను శనివారం అర్ధరాత్రి అపహరించారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవోల్టేజీతో కాలిపోయిన ఉపకరణాలు

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరంలో వైఎస్సార్ విగ్రహం కూడలి ఇళ్లలో విద్యుత్తు హైవోల్టేజీతో శనివారం పలువురి ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. నష్టం విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందన్నారు. ఘటనపై ఏఈ సుధాకర్‌ను వివరణ కోరగా సంస్థాగతంగా పొరబాటు లేదన్నారు. వారి ఇళ్లలో ఎర్త్ వైరు సక్రమంగా లేకపోవడంతో ఇలా జరిగి ఉంటుందన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరంలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలు గుత్తి జానకి ఈ నెల 5న ఇంటికి తాళం వేసి పాలకొల్లు బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం తిరిగి రాగా బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువా పగలగొట్టి 5 కాసుల బంగారు ఆభరణాలు, రూ.80 వేల నగదు అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సినీ నటుడు రాజబాబుకు నివాళి

కోరుకొండ, న్యూస్‌టుడే: సినీ హాస్య నటుడు రాజబాబు జయంతి సందర్భంగా ఆదివారం కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ఎస్‌ఎంసీ ఛైర్మన్ తెలగంశెట్టి శివ, వైస్ ఛైర్మన్ మాతా రాజేశ్వరి, భూపతిరావు, బొడ్డుపల్లి నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, మాతా ప్రభు, రాంబాబు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ధవళేశ్వరం: ధవళేశ్వరం పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు సీఐ గణేష్ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ కేసుల్లో ఇరుక్కుంటే రౌడీషీట్‌ను మరికొంత కాలం పొడిగిస్తామన్నారు. అర్ధరాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి దొరికితే చర్యలు తప్పవన్నారు. గ్రూపులుగా కొట్టుకొంటే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు పీడీ యాక్టు పెడతామన్నారు. మహిళలు, బాలికల జోలికి వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సైలు క్రాంతికుమార్, హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



కోటసత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో ఉన్న కోటసత్తెమ్మను ఆదివారం ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఈరోజు రూ.1,49,820ల ఆదాయం వచ్చిందని, దర్శనాల ద్వారా రూ.35,920, అన్నదాన ట్రస్ట్‌కు రూ.3,517, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.40,265, ఇతర టికెట్ అమ్మకాల ద్వారా రూ.70,118ల ఆదాయం వచ్చిందని ఆలయ [illegible]పల్లి రవిశంకర్ తెలిపారు. సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ప్రధానార్చకుడు ఎస్వీకేప శర్మ ఉన్నారు.

దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన పరీక్షకు 163 మంది

తాళ్లపూడి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో తపాలా శాఖ దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన ఉపకారవేతనం అందించేందుకు పరీక్ష ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్లపూడి పోస్టల్ ఏఎస్పీ వీరభద్రరావు మాట్లాడుతూ ఈ పరీక్షకు ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 163 మంది హాజరయ్యారన్నారు. పరీక్ష పర్యవేక్షకులుగా 12 మంది సబ్‌పోస్ట్‌మేన్‌లు వ్యవహరించారన్నారు. మొదటి దశ స్క్రీనింగ్‌లో ఉత్తీర్ణులైన వారు రెండో దశ ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుందన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థికి సంవత్సరానికి రూ.6వేలు ఉపకారవేతనం ఇస్తారని తెలిపారు.



శక్తి వేషధారణలు, అలంకరించిన వాహనంలో ఊరేగింపు

వైభవంగా దేవి విగ్రహ ఊరేగింపు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా తాడిపర్రులో దుర్గాదేవిని అలంకరించి వాయిద్యాలతో ఆదివారం సందడిగా ఊరేగించారు. బేతాళ, శక్తి, వివిధ దేవతామూర్తుల వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. గ్రామంలోని ఆదర్శనగర్‌లో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు.

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

నల్లజర్ల, న్యూస్‌టుడే: మండలంలోని తూర్పు చోడవరం గ్రామదేవత ముత్యాలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. అమ్మవారికి పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. వివిధ వేషధారణలు, బుట్టబొమ్మలు ఊరేగింపులో ఆకర్షణగా నిలిచాయి. మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు అమ్మవారిని ఊరేగించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కనకదుర్గమ్మ గ్రామోత్సవం

పెరవలి, న్యూస్‌టుడే: పెరవలిలోని కనకదుర్గమ్మవారి గ్రామోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అమ్మవారిని పురవీధుల్లో మేళతాళాలతో గరగనృత్యాలతో ఊరేగించారు.

కుంభాభిషేక మహోత్సవాలకు ఏర్పాట్లు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన తాళ్లపూడిలోని నవదుర్గ దేవి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 21 నుంచి నిర్వహించే మహాకుంభాభిషేకం, శతచండీయాగం మహోత్సవాల ఏర్పాట్లకు యాగశాలలు సిద్ధమైంది. 21న ప్రత్యేక పూజలు, హోమాలు, యాగశాల ప్రారంభం చండీపారాయణం, 22న గరికపాటి నరసింహారావు ప్రవచన కార్యక్రమం, 108 దంపతులతో శతచండీహోమం, 23న దుర్గామల్లేశ్వరస్వామి శాంతి కల్యాణం, అన్నదానం, రథోత్సవం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

హిందూ ధర్మాన్ని పాటించాలి

నల్లజర్ల: గ్రామాల్లోని యువకులంతా హిందూ ధర్మాన్ని పాటించాలని సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ కట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం నల్లజర్లలోని శివాలయం వద్ద కొవ్వూరు, దేవరపల్లి మండలాల గ్రామ కన్వీనర్లు, సహ కన్వీనర్లు, మండలాల కమిటీ సభ్యులకు శిక్షణ సమావేశం జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని యువకులకు సమావేశాలు ఏర్పాటు చేసి హిందూ మతంపై అవగాహన కల్పించాలన్నారు. ఉప్పులపాటి మాధవరావు, బలుసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కళాకారుల సొమ్ము చెల్లించాలి

నిడదవోలు, న్యూస్‌టుడే: నిరుపేద కళాకారుల సొమ్ము చెల్లించాలని కోరుతూ మంత్రి కందుల దుర్గేష్‌కు పెరవలి మండలం అన్నవరప్పాడుకు చెందిన జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.ఆర్.కృష్ణబాబు ఆదివారం వినతి పత్రం అందించారు. గ్రామదర్శిని, జన్మభూమి, సంక్షేమ పథకాలు అమలు చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా కళాకారుల బృందాలు పనిచేశారని వీరికి ఇచ్చిన ఉత్తర్వులు సైతం తమవద్ద ఉన్నాయన్నారు. వీటికి ప్రభుత్వం నుంచి రూ.8కోట్లు చెల్లించాలని కోరుతూ వినతి పత్రం అందించారు.

భారత్ వికాస్ పరిషత్ కృషి అభినందనీయం

చాగల్లు, న్యూస్‌టుడే: గత 62 ఏళ్లుగా విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు భారత్ వికాస్ పరిషత్ చేస్తున్న కృషి అభినందనీయమని పండితులు దోర్బల ప్రభాకర శర్మ పేర్కొన్నారు. భారత్ వికాస్ పరిషత్ ప్రాంత, జాతీయ బృందగాన పోటీలు, కొవ్వూరులోని ఓ కల్యాణ మండపంలో కొవ్వూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. భాజపా రాష్ట్ర నాయకులు పరిమి రాధాకృష్ణ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

నీటి వృథాకు అడ్డుకట్ట



ఈనాడు కథనాలకు స్పందన

మండలంలోని వేగేశ్వరపురం ఆంజనేయస్వామి ఆలయం వద్ద తాగునీటి కొళాయికి బిరడా బిగించారు. గతంలో ఏర్పాటు చేసిన బిరడా పగిలిపోవడంతో తాగునీరు కాలువల్లోకి వెళ్లేది. దీనిపై ఈనెల 18న 'ఈనాడు'లో 'తాగునీటి లీకులతో ఇబ్బందులు' శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి సచివాలయ కార్యదర్శి నాగాంజనేయులు స్పందించారు. కొళాయికి బిరడా ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, తాళ్లపూడి**

విద్యుత్తు స్తంభాన్ని సరిచేశారు..!



దేవరపల్లి: దేవరపల్లి మండలంలోని బంధపురం వెళ్లే రహదారిలో ఒరిగిపోయి ఏ క్షణమైనా పడిపోయేటట్లున్న విద్యుత్తు స్తంభాన్ని అధికారులు సరి చేశారు. 'ఆదమరిస్తే...అపాయమే' శీర్షికన బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర వార్తకు స్పందించి విద్యుత్తుశాఖ ఏఈ సీహెచ్.వెంకట్రావు సిబ్బందితో స్తంభాన్ని సరి చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

దగ్ధమైన చెరకు తోటపై నివేదిక

తాళ్లపూడి, న్యూస్‌టుడే: మండలంలోని గజ్జరంలో శనివారం సాయంత్రం పిడుగులు పడి దగ్ధమైన చెరకు తోటను పరిశీలించామని ఏవో రుచిత ఆదివారం తెలిపారు. బాధిత రైతు మద్దుకూరి సత్యనారాయణ నుంచి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

రహదారి ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నిడదవోలు: నిడదవోలు మండలం సమిశ్రగూడెం వద్ద ఆదివారం రాత్రి పది గంటల సమయంలో రహదారి ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డి.ముప్పవరం వైపు నుంచి నిడదవోలు వస్తున్న కారు సమిశ్రగూడెం మలుపు వద్ద అదుపు తప్పి నిడదవోలు నుంచి సమిశ్రగూడెం వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిలో ఒకరికి కాలు విరగగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని వైద్య సేవల నిమిత్తం అదే కారులో నిడదవోలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

రీసర్వే తప్పులు సరిదిద్దేలా సభలు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: వైఎస్సార్ జగనన్న భూరక్ష రైతులకు తలనొప్పులు తీసుకొచ్చింది. గతంలో చేపట్టిన రీసర్వే అంతా గందరగోళంగా మారింది. దీంతో రైతుల్లో అయోమయం నెలకొంది. ఈ సర్వేలో తగినంత సమయం కేటాయించక, లక్ష్యాల పేరుతో ఒత్తిడి పెంచడంతో చాలామంది సర్వే సిబ్బంది ఆదరాబాదరాగా దీనిని ముగించేశారు. ఒక రైతు భూమి మరోక రైతుకు నమోదు చేయడం, లేని భూమిని ఉన్నట్లుగా చూపించడం, తగ్గించడం, పెంచడం, హద్దులు తప్పుగా నమోదు చేయడం తదితరవి జరిగాయి. దీంతో అప్పట్లో వైకాపా ప్రజాప్రతినిధులకు రైతులు విన్నవించినా పట్టించుకోలేదు. తాళ్లపూడి మండలంలోని పోచవరం, తిరుగుడుమెట్ట రైతులు అప్పట్లో మాజీ హోంమంత్రి వనితకు, అధికారుల వద్ద మొర పెట్టుకున్నారు. అయినా ఫలితం లేదు. ఈ రీసర్వేలో లోపాలను సరిదిద్దడానికి కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తు చేసిన రైతులకు రశీదు ఇచ్చి భూమిని ఎప్పుడు పరిశీలిస్తామో తెలియజేసి పరిష్కరిస్తామని మండల స్థాయి రెవెన్యూ అధికారులు వివరిస్తున్నారు.

మండలం	గ్రామ సభలు
తాళ్లపూడి	11
చాగల్లు	5
కొవ్వూరు	14
గోపాలపురం	9
నల్లజర్ల	4
దేవరపల్లి	8
నిడదవోలు	22
పెరవలి	7
ఉండ్రాజవరం	12



గుట్టలుగా వేసిన సర్వే రాళ్లు

93 రెవెన్యూ గ్రామాల్లో..

కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో రీసర్వే జరిగిన 93 రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించేలా చర్యలు చేపట్టింది. ఈ నెల 17వ తేదీ నుంచి నెల రోజుల పాటు నిర్వహించేలా ఏర్పాటు చేశారు. ఇందుకు మండలాల వారీగా షెడ్యూల్ రూపొందించింది. రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు తదితరులంతా రైతులు అందించిన దరఖాస్తులను స్వీకరించి నష్టపోయిన వారి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. పొరపాట్లు, ఆక్రమణలు తదితర అన్నింటిని గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. 70 రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలి.

పల్లెలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: పల్లెలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లపూడి మండలంలోని ప్రక్కిలంక, పెద్దేవం, తిరుగుడుమెట్టలో పల్లెపండుగ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ మూడు గ్రామాల్లో సుమారు రూ.1.3 కోట్ల నిధులతో సీసీ రహదారుల పనులకు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం పల్లెలను నిర్లక్ష్యం చేసిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అన్నదేవరపేటకు చెందిన అరుణ్‌జ్యోతి బయోవెంచర్ లిమిటెడ్, టాటావాటర్ కోపేకర్స్ సంస్థ జనరల్ మేనేజర్ మధు రూ.50వేలు విజయవాడ వరదబాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు ఇచ్చిన చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చాగల్లు: గత ప్రభుత్వం పల్లెలను పట్టించుకోలేదని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కొవ్వూరు మండలం దేచర్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన పల్లెపండగ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రహదారి పనులకు ఆయన శిలాఫలకాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో పింఛను విధానం తీసుకు వచ్చిన ఘనత దివంగత నేత ఎన్టీఆర్‌కే చెందుతుందన్నారు. పల్లెల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు పీకే రంగారావు, పొట్రు సిద్ధు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సు

చాగల్లు, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సును ఈ నెల 21న కొవ్వూరు తెదేపా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, నియోజకవర్గ అబ్జర్వర్ జి.శ్రీధర్ తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కూటమి మండల, గ్రామ కమిటీల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

24 గంటల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ప్రపంచ రికార్డు స్థాపనే ధ్యేయంగా 24 గంటల పాటు శ్రీకళావేదిక ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో సాహిత్య, సాంస్కృతిక కళా జాతర నిర్వహించారు. అందులో పాలంగికి చెందిన రచయిత, విశ్రాంత అధ్యాపకుడు కోట రామప్రసాదును ఆదివారం సత్కరించారు. 'భరత మాత నన్ను క్షమించు' అనే వచన కవితను ఈ కళావేదికలో ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ మేరకు పలువురు కవులు ఆయనను అభినందించారు.

పిచ్చి మొక్కలతో ఇక్కట్లు



నల్లజర్ల శివారులోని నల్లఎర్ర చెరువు వంతెన వద్ద ఉన్న మలుపులో రహదారి పక్కన పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అసలే మలుపు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాల బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరతున్నారు. దీనిపై కొవ్వూరు ర.భ.శాఖ అధికారి వెంకటరమణను వివరణ కోరగా సిబ్బందిని పంపి తుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, నల్లజర్ల**

రహదారి ఛిద్రం



మండలంలోని ఉండ్రాజవరం నుంచి చివటం మీదుగా వడ్లూరు వెళ్లే రహదారి ఛిద్రంగా తయారైంది. వాహనాల రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉద్యాన పంటలు ఎక్కువగా ఉండటంతో అరటి, కొబ్బరి తదితర లోడు లారీల రాకపోకల సమయంలో సమస్యను ఎదుర్కొంటున్నారు. మరమ్మతు పనులు చేయించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి మరమ్మతు పనులు చేయిస్తామని ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసు తెలిపారు. **- న్యూస్‌టుడే, ఉండ్రాజవరం**



వైద్యులను సత్కరిస్తున్న పీఎంపీలు

పీఎంపీల సమావేశం

నిడదవోలు, ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: నిడదవోలు, కొవ్వూరు మండలాల స్థాయి పీఎంపీల(ప్రైమరీ మెడికల్ ప్రాక్టీషనర్) ఆధ్వర్యంలో వైద్య, విజ్ఞాన అవగాహన సదస్సును నిడదవోలులో ఆదివారం నిర్వహించారు. విచ్చేసిన ప్రముఖ వైద్యులు సౌభాగ్యలక్ష్మి, ప్రకాష్ తదితరులు వైద్య విధానం, అందులో ఉండే సమస్యలపై అవగాహన కల్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, మండలశాఖ అధ్యక్షుడు పోతుల సత్యవరప్రసాదు, కార్యదర్శి పాండ్రాకుల సత్యనారాయణ, కోశాధికారి పేరూరి దానశంకరం, సూర్యకుమారి పాల్గొన్నారు.

సాయిబాబాకు నివాళి

నిడదవోలు, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబాది ప్రభుత్వ హత్యేనని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. సాయిబాబా మృతికి నిడదవోలు సంతమార్కెట్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రగతిశీల కార్మిక సమాఖ్య, కులనిర్మూలన పోరాట సమితి, సీపీఎం, సీపీఐఎంఎల్, బహుజన సేన సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. పీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్, కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జాన్ రాజ్, గెడ్డం రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నాయకుల విగ్రహాలకు రక్షణగా షెడ్డు

చాగల్లు, న్యూస్‌టుడే: సుమారు 1954 నుంచి ఎటువంటి రక్షణ లేకుండా ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలకుర్తి ప్రభాకర్ చౌదరి తన భార్య పద్మావతి జ్ఞాపకార్థం షెడ్డును ఏర్పాటు చేశారు. చాగల్లు ప్రధాన కూడలిలో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు, భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల విగ్రహాలకు షెడ్డు నిర్మాణం ఆదివారంతో పూర్తి అయ్యింది. దీంతో నాయకుల విగ్రహాలకు రక్షణ ఏర్పడినట్లవ్వడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



షెడ్డులో విగ్రహాలు..

మరుగుదొడ్లు లేక ఇక్కట్లు

దేవరపల్లి, న్యూస్‌టుడే: గోపాలపురం నియోజకవర్గం పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో వసతుల కొరతతో ఉద్యోగులు, వివిధ పనులపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీటిలో కనీసం మరుగుదొడ్లయినా లేకపోవడం.. కొన్ని చోట్ల నిర్మాణాలు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నాలుగేళ్ల నిర్లక్ష్యం..

దేవరపల్లిలోని మండల రెవెన్యూ కార్యాలయంలో నాలుగేళ్ల కిందట చేపట్టిన పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. తలుపులు, రన్నింగ్ వాటర్ లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. మండలంలోని 21 గ్రామాల ప్రజలు నిత్యం ఏదో ఒకపని మీద కార్యాలయానికి వస్తుంటారు. వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సొంత మండలం నల్లజర్లలోని మండల పరిషత్తు కార్యాలయంలోను మరుగు సమస్య వేధిస్తోంది. ఇక్కడ 1975లో నిర్మించిన సమితి కార్యాలయ భవనంలోనే మండల పరిషత్తు కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఇక్కడ రెండే మరుగుదొడ్లు ఉండడంతో ప్రజలు, అధికారులు, రాజకీయ నాయకులు అవస్థలు పడుతున్నారు. ఇవి కూడా నిర్వహణకు దూరంగా కనిపిస్తున్నాయి. ఇవి శిథిల దశకు చేరడంతోపాటు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, పుట్టలు ఉండడంతో పాములు మరుగుదొడ్లలో ప్రత్యక్షం అవుతున్నాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రెవెన్యూ కార్యాలయంలో నాలుగేళ్లుగా అసంపూర్తిగా ఇలా..



ఉండ్రాజవరంలో సభ్యత్వ నమోదు చేస్తున్న భాజపా నాయకులు

జోరుగా భాజపా సభ్యత్వ నమోదు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదులో దూసుకుపోతుందని ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు బూరుగుపల్లి శివరామకృష్ణ అన్నారు. మండలంలోని ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నాయకులు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, కొప్పినీడి సత్యనారాయణ, గుత్తుల హరిప్రసాదు, చిట్టూరి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఖురాన్ పఠనం అల్లాహ్‌ను స్మరించే గొప్ప మార్గం

నిడదవోలు, ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ఖురాన్ పఠనం అల్లాహ్‌ను స్మరించటానికి గొప్ప మార్గమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఖురాన్‌ను అభ్యసించి ఉత్తీర్ణులైన 9 మంది విద్యార్థులకు నిడదవోలులో ధ్రువపత్రాలను మంత్రి దుర్గేష్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించారు.



మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

ఆర్థిక సాయం అందజేత

గోపాలపురం, న్యూస్‌టుడే: గోపాలపురం మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు చిట్యాల గ్రామానికి చెందిన దాత రూ.80 వేల నగదు చెక్కును సంస్థ సభ్యులకు ఆదివారం అందజేశారు. కొండేపాటి వీరకృష్ణ జ్ఞాపకార్థం ఆయన మనవరాళ్లు, మనవలు ఇచ్చిన ఈ సొమ్ముతో శీతల శవపేటిక కొనుగోలు చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని మానవత సభ్యులను కొండేపాటి రత్నాజీ చౌదరి కోరారు. ఈ కార్యక్రమంలో మానవత మండల ఛైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, ఇతర సభ్యులు గడా జోగేంద్రప్రసాద్, రాధాకృష్ణ, వెంకట్, కీర్తికుమార్ నాగరాజు పాల్గొన్నారు.



మానవత సభ్యులకు చెక్కు అందిస్తున్న దాత రత్నాజీ

విద్యుత్తు అంతరాయం

నేడు

పెరవలి, ఉండ్రాజవరం: కానూరు విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా సోమవారం సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ నారాయణరావు ఆదివారం తెలిపారు. ఉపకేంద్రం పరిధిలో కానూరు, నడుపల్లి, కానూరుఅగ్రహారం, ఉసులుమర్రులలో వ్యవసాయ, మత్స్య పరిశ్రమల రైతులకు ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. ● చివటంలో మరమ్మతు పనుల్లో భాగంగా ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ ఎస్.నారాయణ తెలిపారు.